
ఆర్ఎఫ్‌సీఎల్‌కు
తప్పిన నీటి గండం 7

ఎన్నికల నిబంధనలపై
అవగాహన కలిగి ఉండాలి 8





రామగుండం కార్పొరేషన్‌లో

స్థలాల కబ్జా

- రికార్డుల ప్రకారం లే ఔట్‌లో 16.44ఎకరాల ఖాళీ స్థలాలు
- రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణకు గురువుతున్న వైనం
- ముస్లిం వెల్ఫేర్ సొసైటీ లేఖ రాసినా స్పందించని కార్పొరేషన్
- ఇప్పటికే 20 గుంటల వరకు కబ్జా

కోల్‌సిటీ, మార్చి 4: రామగుండం నగర పాలక సంస్థ ఆస్తులు కబ్జాదారులకు వరంగా మారాయి. కార్పొరేషన్ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ ఆక్రమించుకోవడం పరిపాటి అయ్యింది. గతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గోదావరిఖని నడిఒ డ్డున సింగరేణి ఇచ్చిన పోచమ్మ మైదాన స్థలాన్ని కబ్జాదారులకు కట్టబెట్టారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రైవేట్ పట్టా దారుల నుంచి మల్కాపూర్ శివారులో కొనుగోలు చేసిన స్థలాలను ఐదారేళ్ల క్రితమే ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసినా పట్టించు కునే నాథుడే లేడు. ఇప్పుడు తాజాగా కార్పొరేషన్ అనుమతి పొందిన లే అవుట్‌లలో కార్పొరేషన్ పేర ఉన్న ఖాళీ స్థలాలు కబ్జా అవుతున్నా రామగుండం నగర పాలక సంస్థ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది.

కార్పొరేషన్ రికార్డుల ప్రకారం రామ గుండం నగరపాలక సంస్థ పరిధిలో అనుమతి పొం దిన లే అవుట్‌లలో మున్సిపల్ కార్పొరేషన్‌కు 16.44 ఎకరాల (657గుంటలు) ఖాళీ స్థలాలు ఉన్నాయి. నోటిఫైడ్ ఏరియా ఏర్పడక ముందు వెలిసిన లే అవుట్‌ల నుంచి తాజాగా వెలిసిన లే అవుట్‌ల వరకు కార్పొరేషన్‌పై ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఎఫ్‌సీఐ శాంతి నగర్‌లోని ఐడీఏ లే అవుట్‌లో (ఎల్‌పీ నెం. 167/82) సర్వే నంబర్135లో 2.38 ఎకరాలు, గోదావరిఖని కవితా థియేటర్ సమీపంలోని టీచర్స్ కాలనీ లే అవుట్‌లో సర్వే నంబర్162, 163లో 0.23 ఎకరాలు, మాతంగి కాలనీలోని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ (ఎల్‌పీ నంబర్7242/90) సర్వే నంబర్ 291లో 1.66ఎకరాలు, గౌతమినగర్‌లో లే అవుట్‌లో సర్వే నంబర్ 125/2-2లో 3.42ఎకరాలు, కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వే నంబర్ 300లో 0.21ఎకరాలు, రామగుండంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సర్వే నంబర్ 322లో 0.57ఎకరాలు, శాంతి నగర్ ఎఫ్‌సీఐ డ్రైవర్స్ అసోసియేషన్ లే అవుట్‌లో సర్వే నంబర్ 135లో 0.42 ఎకరాలు మున్సిపల్‌కు చెందిన ఖాళీ స్థలాలు ఉన్నట్టు రికార్డులు ఉన్నాయి.

అదే విధంగా ఎఫ్‌సీఐలోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో సర్వే నంబర్125/3లో 2.04 ఎకరాలు, మార్కండేయకాలనీ లే అవుట్‌లో 0.88 ఎకరాలు, గంగానగర్ లే అవుట్‌లో 2.62ఎకరాలు మున్సిపల్ కార్పొరేషన్ పేర ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇవే కాకుండా ఎన్‌టీపీసీ, రామగుండంలో ఇందిర మ్మ కాలనీల్లో రెండెకరాలు మున్సిపల్ కార్పొరేషన్ స్థలాలు ఉన్నాయి. రామగుండం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సర్వే నంబర్ 322లో 1.02 ఎకరాలు, ఎన్‌టీపీసీ మేడిపల్లి శివారులోని ఇందిరమ్మ కాలనీలో సర్వే నంబర్ 580లో ఒక ఎకరం ఖాళీ స్థలాలు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉన్నాయి.

ఇవే కాకుండా వివిధ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో కనీసం 10శాతం ప్రజా అవసరాలకు వినియోగించాల్సి ఉంది. ఆర్‌టీసీ ఉద్యోగులు, జర్నలిస్టుల గృహ నిర్మాణ సొసైటీలకు ప్రభుత్వం నామమాత్రపు రేటుపై స్థలాలను కేటాయించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నిర్మాణ సొసైటీలు కూడా ప్రజా అసవరాలకు కొంత మేర స్థలాలను కేటాయించాల్సి ఉంది. ఈ రెండు చోట్ల కూడా స్థలాలను వదిలారు. ఇవే కాకుండా ఎన్‌టీపీసీ, సింగరేణి సంస్థలు ఆర్‌అండ్ఆర్ కింద చేపట్టిన పునరావాస కాలనీల్లో సైతం ప్రజా అవసరాలకు ఖాళీ స్థలాలను కేటాయించాల్సి ఉంది. ఇటీవల ప్రశాంత్‌నగర్ ఆర్‌అండ్ఆర్ కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలం కబ్జా యత్నాలు జరగడం వివాదస్పదమైంది.

● పలు లే అవుట్‌లలో ఆక్రమణలు

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు లే అవుట్‌లలో కార్పొరేషన్‌కు చెందిన స్థలాలు ఆక్రమణకు గుర వుతున్నాయి. ఎఫ్‌సీఐ ఐడీఏ లే అవుట్‌లో 2.38ఎకరాల ఖాళీ స్థలానికి గాను కొంత భాగం కంపోస్టు యార్డు నిర్మించగా మరికొంత స్థలాన్ని ఎన్‌పీడీసీఎల్ సబ్‌స్టేషన్‌కు కేటాయించారు. మరో 20 గుంటలు ఖాళీగానే ఉంది. శాంతినగర్‌లోని డ్రైవర్స్ అసోసియేషన్‌లో మున్సిపల్ స్థలంపై స్పష్టత లేదు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ పరిధిలో గల 1.66 ఎకరాల కార్పొరేషన్ స్థలం కబ్జాకు గురవుతోంది. ఈ స్థలాన్ని నోటిఫైడ్ ఏరియా కమిషనర్ పేర సొసైటీ అధికారికంగా రిజిష్టర్ చేసింది. అయినా కూడా మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని కాపాడుకోవడంలో విఫలమవుతోంది. ఈ స్థలంలో కొందరు నాయకులు రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మరికొందరు ఆక్రమణలు చేశారు. స్థలం కబ్జా అవుతుందని, రక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా సొసైటీ పలుమార్లు నగర పాలక సంస్థకు లేఖలు రాసినా కూడా స్పందన లేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొంత స్థలం ఆక్రమణకు గురైంది. ఎన్‌టీపీసీలోని ఇందిరమ్మ కాలనీలో సైతం మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. రామగుండం నగర పాలక సంస్థ పలు ప్రజా అవసరాల నిర్మాణాలకు స్థలాలు లేవనే కారణంగా పనులు పెండింగ్‌లో పెడుతోంది. మరో వైపు కోట్లాది రూపాయల విలువైన స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు.

తాగునీటి కొరతలేకుండా చర్యలు తీసుకోండి

- డీపీవో ఆశాలత


ఓదెలలో తనిఖీ చేస్తున్న డీపీవో ఆశాలత

ఓదెల, ఏప్రిల్ 4: ఎండలు ఉధృతం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత నివారణలో భాగంగా తగు చర్యలు తీసుకోవాలని డీపీవో ఆశాలత సిబ్బందిని కోరారు. గురువారం ఓదెలలో డీపీవో ఆశాలత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పల్లెప్రగతి పనులు, సెగ్రిగేషన్ షెడ్ల పనివిధానం, శ్మశాన వాటికలను, రోడ్లు, కాలువలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని పనుల నిర్వహణలో పలు సూచనలు చేశారు. అలాగే గ్రామాల్లో నీటి కొరత లేకుండా ఇప్పటినుంచి తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డీపీవో వెంట ఎంపీవో కాటం భాస్కర్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని, ఏప్రిల్ 4: మంథని విద్యుత్ సబ్ స్టేషన్‌లో రిపేర్ కారణంగా విద్యుత్ సరఫరాలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ మల్లయ్య గురువారం తెలిపారు. అంతరాయానికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి


విద్యార్థినికి చెక్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్‌విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన బిరుదు మనస్విని జిల్లా అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, డీఈవో మాధవి జిల్లా కేంద్రంలో అభినందించి నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థినులకు వారికి ఇష్టమైన రంగంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రాష్ట్ర జాతీయస్థాయిలో ఆల్ఫోర్స్ విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన బిరుదు మనస్వి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగిన అండర్- 14 జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొని అద్వితీయమైన ప్రతిభను కనబరిచగా విద్యార్థినిని అభినందించారు. డీవైఎస్‌వో సురేష్, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం

- ఎంపీటీసీల ఆందోళన
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ముత్తారం ఏప్రిల్ 4: మండలంలో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లను అధ్వానంగా వేశారని అధికారుల పర్యవేక్షణ లేకుండానే రోడ్లు పూర్తి చేశారని ఓడేడు ఎంపీటీసీ పోతుపెద్ది కిషన్ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా ప్రతీ గ్రామానికి అంతర్గత సీసీ రోడ్లు మంజూరయ్యాయని వాటికి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన గుత్తేదారులు వారి ఇష్టారీతిలో రోడ్లను నాణ్యత లేకుండా వేశారని అధికారుల పర్యవేక్షణలో లేకుండా రోడ్లు ఎలా వేస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అలాగే నూతన ప్రభుత్వం ఏర్పడిననాటి నుంచి విద్యుత్ కోతలు ఉంటున్నాయని దీంతో బావుల వద్ద మోటార్ నడవక పంటలు ఎండిపోతున్నాయని ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటి విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులు గ్రామాలను పట్టించుకోవడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని గ్రామాల పరిశుభ్రతతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏబీవీపీ అధ్వర్యంలో కంటి పరీక్షలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: ఏబీవీపీ ఫోరం స్టూడెంట్స్ ఫర్ సేవ సుల్తానాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాణి డిగ్రీ పీజీ కళాశాలలో గురువారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ ఫర్ సేవ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ సందనవేణి ఓమేష్ మాట్లాడుతూ స్టూడెంట్స్ ఫర్ సేవ వినూత్నమైన ఆలోచనతోటి కంటి పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని దానిలో భాగంగా గురువారం శ్రీవాణి డిగ్రీ పీజీ కళాశాలలో విద్యార్థులకు కంటి పరీక్ష నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నేత్రవైద్య సహాయకులు భూతగడ్డ చందు, విష్ణు, భక్తుల రిషి రసూరి ప్రవీణ్, బండి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ టెక్నాలజీలో యువతకు ఉచిత శిక్షణ

- కోర్సు పూర్తి చేసిన ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధి - సీపెట్ అధికారి గోవిందు

జ్యోతినగర్, ఏప్రిల్ 4: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్), ఎన్టీపీసీ సహకారంతో ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకుకు ప్లాస్టిక్ టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సీపెట్ అధికారి (హైదరాబాద్) ఎస్ గోవిందు తెలిపారు. గురువారం ఎన్టీపీసీ వొకేషనల్ ట్రైనింగ్ సెంటరులో జరిగిన వి లేక రుల సమావేశంలో గోవిందు మాట్లాడారు. ప్రధానంగా ఎన్టీపీసీ ప్రభావిత 17 గ్రామాలు, రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపా ధి కల్పించాలనే ఉద్దేశంతో మెషీన్ ఆపరేటర్ ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సులో ఉచితంగా శిక్షణనిస్తామన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీపెట్ అధికారి గోవిందు

ఆరు నెలల ఈ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణతోపాటు వసతి, భోజనం, ఇతర ఉపకరణాలను అందజేస్తామని తెలిపారు. ఉపాధి లేక బాధపడుతున్న స్థానిక నిరుద్యోగ యువతకు తక్కువ వ్యవధిలోనే ఎంవోపీపీ కోర్సులో శిక్షణనిచ్చి ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. ఈ కోర్సులో శిక్షణ పొందిన వారికి మల్టీనేషనల్ కంపెనీలు, విదేశాలలో సైతం ఉద్యోగాలు కల్పించామన్నారు. అలాగే ఆర్థిక స్తోమత ఉన్నవారు సొంతంగా తామే ప్లాస్టిక్ పరిశ్రమను నెలకొల్పే అవకాశ ముందని గోవిందు తెలిపారు. పరిశ్రమ స్థాపనలో వారికి సీపెట్ సంస్థ సరైన మార్గదర్శనం చేస్తుందన్నారు. ఎంవోపీపీ కోర్సులో చేరేందుకు పదో తరగతి కనీస విద్యార్హతతోపాటు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల వయసు సడలింపు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుదన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 10 వరకు ఎన్టీపీసీ ఒకెషనల్ ట్రైనింగ్ సెంటర్, సాయి సేవా సమితిలో సంప్రదించాలని లేదా 9959333417(గోవిందు), 9849590080 (యుగంధర్‌రావు, ఎన్టీపీసీ సీఎస్ఆర్) నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని స్థానిక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాల ని గోవిందు కోరారు. విలేకరుల సమావేశంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఇన్‌చార్జి వేముగంటి యుగంధర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

మంథని, మార్చి 4: మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు బీజేపీ పార్టీ నూతన మండల అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని పట్టణాధ్యక్షుడిగా సబ్బని సంతోష్, మంథని మండల అధ్యక్షుడిగా వీరవేన రాజేందర్, కమాన్‌పూర్ మండల అధ్యక్షుడిగా జంగపల్లి అజయ్, రామగిరి మండల అధ్యక్షుడిగా ములుమూరి శ్రీనివాస్, ముత్తారం మండలం అధ్యక్షుడిగా బిరుదు గట్టయ్య నియామకం అయ్యారు.

మల్హర్‌రావు మండలం అధ్యక్షుడిగా ముడతనపల్లి ప్రభాకర్, కాటారం మండల అధ్యక్షుడిగా బండం మల్లారెడ్డి, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా మేడిపల్లి పూర్ణచందర్, మహాదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా ఆకుల శ్రీధర్, పలిమెల మండల అధ్యక్షుడిగా కోయాల్కర్ నిరంజన్‌లను నియమించినట్లు సునీల్‌రెడ్డి తెలిపారు.

ఛలో తుక్కుగూడను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4: ఈ నెల 6న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన చలో తుక్కుగూడ సభను విజయవంతం చేయాలని రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఠాగూర్ మక్కాన్‌సింగ్ గురువాం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జన జాతర భారీ బహిరంగ సభకు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇతర నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. సభకు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4: గత నెల 28న ప్రమాదానికి గురైన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు సుమారు 40-45 సంవత్సరాల వయస్సు, నలుపు రంగు ముఖం, తెల్లగడ్డం ఉన్న వ్యక్తిని గుర్తిస్తే 87112656504, 8712656506, 872556507 నంబర్లకు సంప్రదించాలని ఏఎస్సై రామస్వామి సూచించారు. మృతదేహం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురి గదిలో ఉంచినట్టు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో ఐక్యతా రాగం

- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు సంపూర్ణ మద్దతు - పార్టీ నిర్ణయమే శిరోధార్యం అంటున్న నేతలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలకు ఫుల్ స్టాప్ పడింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహా అందరు ఎమ్మెల్యేలు కలిసి వచ్చే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థి వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను లక్షకుపైగా మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరినీ ఏకతాటిపైకి తీసుక రావడంలో వారం రోజుల నుంచి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. అంతా కలిసి ఐక్యతా రాగం వినిపించారు. రాష్ట్రంలో పెద్దపల్లితో పాటు నాగర్ కర్నూల్, వరంగల్ నియోజకవర్గాలను ఎస్సీలకు రిజర్వు చేశారు. నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణల పేర్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిద్దరూ మాల సామాజిక వర్గానికే చెందిన వారు కావడం గమనార్హం. వరంగల్ నుంచి కడియం కావ్యను అభ్యర్థిగా నిలుపుతున్నారు. ఈమె మాదిగ ఉప కులమైన బైండ్ల సామాజిక వర్గం. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగ ఓటర్లు ఉన్నారని, 18 లక్షల మంది మాల ఉన్నారని, పెద్దపల్లి అభ్యర్థిని మార్చి మాదిగ సామాజిక చెందిన వారికి టికెట్ ఇవ్వాలని, మాదిగ శక్తి, మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ ఆఫీస్ ఎదుట కూడా ఆందోళన నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, ప్రేమ్‌సాగర్ రావు వంశీకి టిక్కెట్ ఇవ్వడంపై అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఆయనకు ఎవరి నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో పార్టీ ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించలేక పోయారు. మరోవైపు వివేక్ సోదరులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చింతకుంట విజయరమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌లతో పలుసార్లు చర్చించారు. ఎట్టకేలకూ చర్చలు కొలిక్కి రావడంతో బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థి వంశీకృష్ణను లక్షకు పైగా మెజారిటీతో గెలిపిస్తామని ప్రకటించారు.


మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యేలు

● దీక్ష కోసం వరప్రసాద్ యత్నాలు..

పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణను మార్చకుంటే పెద్దపల్లిలో న్యాయ పోరాట దీక్ష చేస్తానని ప్రకటించిన ఊట్ల వరప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో అనుమతి కోసం ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. మొదట మూడు రోజులు రిలే నిరాహార దీక్ష చేసి, ఆ తర్వాత ఆమరణ దీక్ష చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. గురువారం సాయంత్రం వరకు కూడా అధికారుల నుంచి అనుమతి లభించలేదు. అనుమతి తీసుకునే విషయమై ఆయన హైకోర్టును కూడా ఆశ్రయించారు. అనుమతి వస్తే 5వ తేదీ నుంచి దీక్ష ప్రారంభిస్తానని, రాకుంటే ఆ తర్వాత చేపడతానని వరప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భవన నిర్మాణ కార్మికుడు సిరిపురం ముత్తయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ముత్తయ్య భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట కొడుకు శ్రీనివాస్‌ను రూ.2లక్షలు అప్పులు బహ్రెయిన్ దేశానికి పంపించాడు. మరో రూ.2 లక్షలు బాకీలు చేసి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. కూలీ పనులు చేసిన కుటుంబ పోషణ భారంగా మారింది. చేతిలో డబ్బులు లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. ఓ వైపు అప్పులు.. మరో వైపు కుటుంబాన్ని పోషించే మార్గం కానరాక మనస్థాపం చెందిన ముత్తయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4; మండలంలోని పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో జగిత్యాల మైనింగ్ అధికారులు రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ని పట్టుకున్నారు. మైనింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాకు వచ్చిన పక్కా సమాచారంతో పాతగూడూర్ దస్తగిరి గుట్టకు వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుండగా పట్టుకుని వాటికి సుమారుగా 4 వేలు జరిమానా విధించినట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. మండలంలో అక్రమ మట్టి రవాణా చేస్తే వాహనాలను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా వదలమని మైనింగ్ అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి గాయాలు

రామడుగు, ఏప్రిల్ 4: మండలంలోని వెదిర గ్రామంలో ఉపాధిహామీ కూలీలపై తేనేటీగలు గురువారం దాడి చేశాయి. పనులు చేపట్టేందుకు వెళ్లిన కూలీలపై దాడి చేయగా 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో సాయంత్రం 12 మందిని ఇంటికి తరలించారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట, ఏప్రిల్ 4: జమ్మికుంట-ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ యువకుడు పాట్నా ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గురువారం మృతి చెందాడు. ఝార్ఖండ్ రాష్ట్రం ఛత్ర జిల్లా కోటప్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (18) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మార్గ మధ్యలో జమ్మికుంట-ఉప్పల్ స్టేషన్ల మధ్య రైల్లో నుంయి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,650 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 45మంది రైతులు 737క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,650, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆది, సోమ, మంగళవారాలు మార్కెట్‌కు సెలవు ధినాలు కాగా, తిరిగి బుధవారం పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానున్నట్లు మార్కెట్ కార్యదర్శి గూగులోతురెడ్డి నాయక్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సైదాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని సోమారం గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్య తెలిపారు. గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఏడుగురు పేకాడుతున్నారని చెప్పారు. ఇందులో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ముగ్గురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి 3,100 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు

వీణవంక, ఏప్రిల్ 4: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు వీర్ల రఘు, అశాడపు వినయ్‌ల పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వినయ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలమని, వీర్ల రఘు పరారీలో ఉన్నారని తెలిపారు.

రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం



ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలోనికి వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్4: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం ప్రారంభమైనా ఈ పరీక్షలు ఏప్రిల్ 5,6,8,9,12వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు నిర్వహిం చనున్నారు. మొదటి రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే నిర్వహించారు. మొదటి షిఫ్టులో 676 మంది విద్యా ర్థులకు 598 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 676 మందికి 610మంది హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 4: శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు (34) వ్యవసాయ కూలీ, హార్వెస్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామంలో సామూహిక పోచమ్మ బోనాలు ఉన్నందున ఫంక్షన్‌కు వెళ్లవద్దని తల్లి, భార్య చెప్పినా వినకుండా అతడి మేనల్లుడు మంద హరీష్‌ను వెంటబెట్టుకొని హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని సింగాపూర్ నుంచి చింతగుట్టకు వస్తుండగా కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ రహదారిపై కరీంనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్తున్న సిరిసిల్ల డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న హరీష్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, భార్య పూజ, ఇద్దరు కుమారులు సాయిగణేష్, సాత్విక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలి



కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ఏఓకు హన్మంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ హన్మంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి అత్యావసరాలు గల ఉద్యోగ, ఉపాధ్యాయులను మినహాయిం చాలని కోరారు. చిన్న పిల్లలు గల తల్లులు, దివ్యాంగులను, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారిని మినహాయించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి వసతి కల్పించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో రీతిగా ఎన్నికల భత్యాల పంపిణీ చేశారని, అతి తక్కువగా కోరుట్ల నియోజకవర్గంలో చెల్లించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న సైకిల్ యాత్ర

వేములవాడ, ఏప్రిల్ 4: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం వేములవాడకు చేరుకుంది. రాజు ఐదు రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకోగా ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి గణేష్ సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు.

అక్రమంగా మద్యం, డబ్బు తరలించొద్దు



తనిఖీ చేస్తున్న పోలీసులు

వీర్నపల్లి, ఏప్రిల్ 4 : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా చేయొద్దని ఎస్‌ఐ రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఒకరి అరెస్టు

ముస్తాబాద్, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చిన్నకోడూర్ మండలం జక్కపూర్ గ్రామానికి చెందిన మంతూరి మహేష్ గతంలో ముస్తాబాద్‌లో విశాలాక్షి మెస్ వద్ద బైక్, మాతృశ్రీ గార్డెన్ నుంచి బైక్ వేములవాడ తిప్పాపూర్ నుంచి స్కూటీ దొంగతనం చేశాడు. సీసీటీవీ సహాయంతో నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన గుండవెని నారాయణ, బురుజుకింది ప్రవీణ్ గౌడ్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులుకేసు నమోదు చేశారు.

గుడుంబా తయారీ కేసులో ఒకరి రిమాండ్

ముస్తాబాద్, ఏప్రిల్ 4 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ కేసులో రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్లపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపు రాధిక గుడుంబా అమ్ముతూ గతంలో పట్టుబడింది. స్థానిక తహసీల్దార్ ఎదుట ఒక సంవత్సరానికి లక్ష రూపాలయ పూచికత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరకడంతో నోటీసు అందించారు. డబ్బులు కట్టకపోగా తిరిగి గుడుంబా విక్రయిస్తుండడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రాధికను రిమాండ్‌కు పంపినట్లు సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఓ ద్విచక్రవాహనదారుడిని ట్రాలీ ఆటో గురువారం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. జవహర్ నగర్‌కు చెందిన మార్క సది అనే ద్విచక్రవాహనాదారుడిని వెనుకనుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు తప్పిన నీటి గండం

- కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి జోక్యంతో నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం
- ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా సరఫరా



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)కు నీటి గండం తప్పింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నిల్వలు లేవని, ఏప్రిల్‌లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా చేయలేమని ఇరిగేషన్‌శాఖ పేర్కొనడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్ వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఏప్రిల్, మే నెలలో యూరియా ఉత్పత్తి జరిగితేనే రాబోయే వర్షాకాల సీజన్‌లో రైతాంగానికి యూరియా సరఫరాకు అవకాశం ఉంటుంది. పరిశ్రమకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరా నిలిచిపోతే యూరియా ఉత్పత్తికి ఆటంకం కలుగనున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ కార్యదర్శి రాష్ట్రప్రభుత్వ ప్రధనా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఈవో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు లేఖ రాశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో సగం తెలంగాణకే సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలకంగా మారింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 138మీటర్లకు దిగువన నీరు ఉంటే సరఫరా జరిగే అవకాశం ఉండదు. కేవలం మంచినీటి అవసరాలు, ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకే వినియోగించే అవకాశం ఉంది. 134 నుంచి 138మీటర్ల మధ్య డెడ్ స్టోరేజీలో ఎల్లంపల్లిలో 2.35టీఎంసీల నీటి నిల్వలుంటాయి. ఈ నీటిని వినియోగించుకుని ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తికి ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మిషన్ భగీరథ స్కీమ్ నుంచి రోజుకు 18 క్యూసెక్కుల నీటిని ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరిన ప్రత్యేకంగా సబ్ మెర్సిబుల్ మోటార్లు బిగించి హైదరాబాద్ మెట్రో పాలిటిన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అంగీకారం కూడా తెలిపింది. బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సీ సుదర్శన్‌రెడ్డి ఈ మేరకు గురువారం మున్సిపల్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రోజూ 18క్యూసెక్కుల నీటి సరఫరా బాధ్యత తాము తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ అవసరాలకు రోజూ 330క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 58క్యూసెక్కులు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు 18క్యూసెక్కులు కలిసి రోజూ 406క్యూసెక్కులు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నీటి మట్టం 138మీటర్లకు దిగువన పడిపోయిన సందర్భంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌తో పాటు ఆర్‌ఎఫ్‌సీఎల్ కూడా సబ్ మెర్సిబుల్ మోటార్ల బిగింపు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరా చేయాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, మిషన్‌భగీరథ, మున్సిపల్, మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మిషన్‌భగీరథ ద్వారానే ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా భవిష్యత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని, స్థానికంగా ఉన్న ఇతర నీటి వనరులను వినియోగించుకోవాలని అన్నారు. ప్రస్తుతం మిషన్‌భగీరథ మెయిన్ పైప్‌లైన్ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వద్దకు ముందుగా నీరు చేరుకునే విధంగా చూడాలన్నారు. మిషన్‌భగీరథలో సాంకేతిక సిబ్బంది ఇంజనీర్లు, షిఫ్టుల వారీగా 24 గంటలు పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా సజావుగా జరిగేందుకు ప్రత్యేక అభివృద్ధినిధుల కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ప్రతీ రోజు ఇంటింటికి నీటి సరఫరా వాస్తవిక వివరాలు అందించాలని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఇంటికి నీటి సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల, మున్సిపాలిటీల్లో ఉన్న బోరు బావులు, అవసరమైన మరమ్మతు చేశామని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో రూ.2.49 కోట్లతో 136 పనుల్లో 60 పనులు పూర్తి చేశామని, 75 పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నీటిసరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 9398684240కు సంప్రదించాలని సూచించారు. అనంతరం అగ్రహారం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్‌భగీరథ ఈఈలు జానకి, విజయ్, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహాలు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టీపీవో అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 4: సైదాపూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన తూటి లక్ష్మిపతి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కళ్లు కనపడడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో కళ్ల ఆపరేషన్ చేపించుకోవడానికి డబ్బులు లేక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రాత్రి వరకు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. గురువారం ఉదయం గొడిశాల శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు అటు వైపు వెళ్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌నగర్‌లో గొడవ..

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో గురువారం సాయంత్రం గొడవ జరగగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తెలి పారు. తల్హా అనే వ్యక్తిని ఇమ్రాన్ సుఫియన్, సుబన్, మరికొంత మంది కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి



హరికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పరీక్షలు ముగియడంతో సరదాగా ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ(15)ను చెరువులో మునిగి మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు వద్ద గురువారం చోటు చేసుకుంది. అటు అల్మాస్‌పూర్, ఇటు విద్యార్థి స్వగ్రామమైన వీర్నపల్లి మండలం కంచర్లలో విషాదం నింపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి హరికృష్ణ వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. పరీక్షలు ముగియడంతో తన మిత్రుడు కొమిరె రాకేశ్‌తో కలిసి అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. ఈత కోసం హరికృష్ణ నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. గట్టు పైనున్న రాకేశ్ భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశాడు. కొంత దూరంలో ఉన్న గొర్రెల కాపారికి విషయం చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి చెరువు వద్దకు వచ్చే లోపే హరికృష్ణ నీట మునిగి చనిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐలు రమాకాంత్, రమేశ్ స్థానికులు, యువకుల సహాయంతో శవాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. హరికృష్ణ తండ్రి వెంకటి రెండు నెలల కిందట పెద్ద కొడుకు రాజుకుమార్‌తో కలిసి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు.

- కందకం వల్లే..

అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు సమీపంలో బొప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి భూమిని కొనుగోలు చేసి చెరువు చుట్టూ భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే విద్యార్థి హరికృష్ణ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు, అల్మాస్‌పూర్, కంచర్ల గ్రామస్థులు ఆరోపించారు. గతంలో రైతులు ఆందోళన చేపట్టిన సదరు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొంటు న్నారు. చెరువు చుట్టు భారీ కందకాలు తీయడంపై అధికారులు స్పందిస్తే తమ కొడుకు ప్రాణాలు దక్కేవని తల్లి లక్ష్మీ, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల తమ కొడుకు మృతికి కారణమైన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: చెరువు సమీపంలో భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ మృతికి సంబంధించి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు ప్రాంతంలో ఈతకు వెళ్లి వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలోని పదో తరగతి విద్యార్థి హరికృష్ణ నీట మునిగి చనిపోయాడని పేర్కొన్నారు. చెరువు సమీపంలో చిదుగు గోవర్ధన్‌గౌడ్ భూమిని కొనుగోలు చేసి చుట్టు తీసిన కందకాల్లో నిలిచిన నీటిలో ఈత కోసం ప్రయత్నించగా తన కొడుకు మృతి చెందాడని బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

చేపలు పట్టడంలో వివాదం.. వ్యక్తిపై కత్తితో దాడి

జ్యోతినగర్, ఏప్రిల్ 4: ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఒక వ్యక్తి కత్తిపోట్లకు దారి తీసింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ మధ్య ఉన్న వివాదం సమసిపోవాలంటే తమకు అడ్డంగా ఉన్న చిట్టబోయిన చందును చంపాలని దాసరి భిక్షపతి, లింగాల సారయ్య, దాసరి లక్ష్మీనారాయణ పథకం వేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలం పనులకు వెళ్తున్న చందును అడ్డుకున్నారు. దాసరి భిక్షపతి, లింగాల సారయ్య చందును పట్టుకోగా, దాసరి లక్ష్మీనారాయణ కత్తితో పొడిచి ముగ్గురు పారిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చందును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి అన్న కొడుకు ఫిర్యాదు మేరకు దాసరి భిక్షపతి, సారయ్య, లక్ష్మీనారాయణలపై కేసు నమోదు చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన చైతన్య టెక్నో పాఠశాల 8వ, 9వ తరగతి విద్యార్థులు ఇటీవల బంగారు పతకాలు సాధించడంతో గురువారం పలువురు అభినందించారు. నేపాల్ దేశంలోని పొకార పట్టణంలో గల రంగసాలా స్టేడియంలో ఇటీవల నిర్వహించిన థర్డ్ సౌత్ ఏషియా ఇంటర్ నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి సచిన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా మేటిగా ఉండడం గర్వకారణమన్నారు. కాగా పాఠశాలకు చెందిన సాయి వరుణ్, దన్నపునేని సహర్ష్, హిమోక్షన్, అయాన్ పాషా, కీర్తి వర్ధన్, హర్షిత్, పృథ్వి, మోక్షిత్, రోహిత్, విజితేంద్ర, లక్ష్మీ ప్రణవ్ జూనియర్ (అండర్ 16) ఇండియా టీమ్ తరపున ఆడి గెలుపొందారు. పాఠశాల కోచ్ ఇందిరాల వంశీ కిషోర్, పీఈటీ కొమ్మురాజుల అజయ్ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల ఏజీఎం రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ శివకోటేశ్వర్ రావు, డీన్ బిడారి శ్రీనివాస్, బ్యాచ్ ఇన్‌చార్జీ వంశీ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో వెల్గటూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పోలీసులు రాజారాంపల్లిలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎనిమిది ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తుండగా రాజారాంపల్లి వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నారని వాటిని పట్టుకుని ఎస్‌ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 10 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇందులో ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్షతోపాటు ఇద్దరికి కలిపి 3 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగగా 8 మంది వాహనదారులకు 11 వేల రూపాయల జరిమానాను విధించినట్లు సీఐ తెలిపారు.

అడుగంటుతున్న రిజర్వాయర్లు

- రోజరోజుకు తగ్గుతున్న నీటి మట్టాలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు




నీటి నిల్వలు తగ్గిన ఎల్‌ఎండీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. భూగర్భ జాలలు కూడా ఎప్పుడు లేనంతగా పడిపోతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లకు ఎగువ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఆర్వీ కర్ణన్

వేసవి నెలల్లో తాగు నీటి ఇబ్బందులను అదిగమించేందుకు ప్రభుత్వం ప్రతేక అధికారులను నియమించింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కలిపి వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాసంగిలో ఎల్‌ఎండీ నుంచి దిగువకు 28.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి 15 టీఎంసీలు వచ్చాయి. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 5.231 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 1.24 టీఎంసీల నీరు మరో రెండు, మూడు రోజులలో ఎల్‌ఎండీలోకి రానున్నాయి. దీంతో ఎల్‌ఎండీ నీటిమట్టం 6.5 టీఎంసీలకు చేరుతుం ది. ఈ నీటిని జూలై 31 వరకు తాగునీటి కోసం ఉపయోగిస్తారు.

తాగు నీటికి ఇబ్బంది లేదు..



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినా, జూలై 31 వరకు తాగు నీటికి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరాం. రైతులు సహకరించారు. ప్రస్తుతం వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తాం.

- బి శంకర్, ఈఎన్సీ

రిజర్వాయర్లలో నీటిమట్టాలు

జలాశయం	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వలు	గత సంవత్సరం నీటి నిల్వలు	డెడ్ స్టోరేజ్	మిషన్ భగీరథకు/అవిరిగా నీటిఖర్చు
దిగువ మానేరు	24.034 టీఎంసీ	5.231 టీఎంసీ	11.712 టీఎంసీ	2.1 టీఎంసీ	143 క్యూసెక్కులు/ 125క్యూసెక్కులు
ఎంఎంఆర్	27.50 టీఎంసీ	7.69 టీఎంసీ	20.14 టీఎంసీ	3.82 టీఎంసీ	40 క్యూసెక్కులు/ 90క్యూసెక్కులు
ఎస్సారెస్పీ	90.3 టీఎంసీ	12.64టీఎంసీ	25.462 టీఎంసీ	5.00 టీఎంసీ	231 క్యూసెక్కులు/ 314క్యూసెక్కులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- స్కూల్స్, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో తనిఖీలు
- ఫైర్, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులతో సీపీ సమీక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ సూచించారు. గురువారం రామగుండం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాకు చెందిన ఫైర్, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు వివిధ పరిశ్రమల ఫైర్, సేఫ్టీ ఆఫీసర్లతో సమీక్ష సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం కమిషనరే ట్ పరిధిలో ఎన్ని ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి, సిబ్బంది వివరాలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకో వాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పరిధితో సంబంధం లేకుం డా దగ్గరలో ఉన్న ఫైర్ స్టేషన్ సిబ్బంది, అధికారులు స్పందించాలన్నారు. ప్రమాదం జరిగిన సమీపంలో వాటర్ సోర్స్ అవగాహన కలిగి ఉండాలని, ప్రమాద భౌతిక పరిస్థితులు తెలుసుకుని దానికి సిద్ధం కావాల ని తెలిపారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల్లో అగ్ని మాపక తనిఖీలు చేయాలని సూచించారు. పోలీస్, ఫైర్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పాఠశా ల భవనాలు, పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌లు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించి ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు భద్రత కల్పించడమే ముఖ్యమని, అందుకు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

అనుగుణంగా అధికారులు పని చేయాలని, కొందరు సెల్యూలర్‌లో షాపులు నిర్వహించడం వల్ల ప్రమాద కరమైన వస్తువులు నిల్వ చేస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేం ద్రరావు, గోదావరిఖని ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్టీపీపీ సేఫ్టీ ఆఫీసర్ సురేష్, రమేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, పెద్దపల్లి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, మంథని ఫైర్ ఆఫీసర్ సదానందం, మంచిర్యాల, బెల్లంపల్లి ఫైర్ ఆఫీసర్లు దేవేందర్, అనిల్‌కుమార్, బసంత్‌నగర్ సేఫ్టీ ఆఫీసర్ మల్లికార్జున్, శ్యాంసుందర్, ఎన్టీపీసీ మేనేజర్ ఆదేశ్ పాండే, ఏవీఎస్ రెడ్డి, ఆర్‌ఎఫ్‌సీఎల్ సేఫ్టీ ఆఫీసర్లు సత్యనారాయణ, గోపాల్‌కు మార్, సింగరేణి రెస్క్యూ ఆఫీసర్ మాధవ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్‌కుమార్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ పకడ్బందీగా పనిచేయాలి...

మహిళల రక్షణ కోసం షీ టీమ్ పకడ్బందీగా పని చేయాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ షీ టీమ్‌కు సూచించారు. గురువారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల షీ టీమ్‌లతో కాఫీ విత్ షీ టీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, ఎవరైనా ఫిర్యాదు లు చేస్తే మౌనంగా ఉండకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళలు సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులను, మహిళలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల రక్షణ విషయంలో భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ఆయన మాట్లాడారు. ఎవరైనా ఇబ్బందులు ఉంటే 6303923700 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా డయల్ 100కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు.

● షీ టీమ్స్ సిబ్బందికి అభినందన..

రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న షీ టీమ్ సభ్యులను రామగుండం సీపీ అభినందించా రు. కమిషనరేట్ పరిధిలో 205 అవగాహన సదస్సులు, 690 హాట్‌స్పాట్ విజిట్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతు న్న 25మందిని పట్టుకుని కేసులు నమోదు చేయడం, 18ఫిర్యాదులు రాగా నలుగురిపై కేసులు నమోదు, 11మందిపై ఈ పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. ఇంటర్, 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల ను ఇబ్బందులకు గురి చేస్తున్న 22మంది ఆకతాయిల ను పట్టుకుని వారి వద్ద నుంచి 10మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని, 13మంది మైనర్ల తల్లిదం డ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింద న్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, పెద్దపల్లి షీ టీమ్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, మంచిర్యాల షీటీమ్ ఇన్‌చార్జి షైమ, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ కూలర్ వితరణ

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత రాధాకృష్ణ కుటుంబ సభ్యులు వాటర్ కూలర్‌ను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు జ్ఞాపకార్థం వారు ఈ కూలర్‌ను ఆసుపత్రికి అందించగా గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి కూలర్‌ను ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బిరుదు కుటుంబ సభ్యులతో పాటు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్4: ఇటీవల నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దంప తులు గణపతి పూజలు నిర్వహించారు. విజయరమణారావు-పావనిలు గణపతి హోమం, అభిషేకాలు చేసి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆ కార్యక్రమంలో నూగిళ్ళ మల్లయ్య, గోపగాని సారయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, భూతగడ్డ సంపత్, అంతటి అన్నయ్యగౌడ్, చేతి ధర్మయ్య, తాడూరి శ్రీమాన్, ఆరే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4: స్థానిక అయ్యప్ప టెంపుల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాని గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రాంభించారు. కార్యక్రమంలో ఉప్పు రాజు, సయ్యద్ ఖలీద్, సయ్యద్ మస్రత్, ఎరుకల రమేష్, అసీఫ్, నాగుల ఒదెలు, బొడ్డుపెల్లి అశోక్, తూముల మనోహర్‌రావు, ఉప్పు రాంచంద్రం తదితరులున్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు


గ్రామ దేవతలను దర్శించుకుంటున్న వంశీకృష్ణ

ఓదెల, ఏప్రిల్ 4: మండలంలోని కనగర్తిలో మూడురోజుల నుంచి నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని అన్నారు. ప్రజలంతా పాడిపంటలతో సుఖ,సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలను వేడుకున్నానని తెలిపారు. ప్రజల అభిమానం, ఎమ్మెల్యే విజయరమణారావు నాయకత్వంలో పెద్దపల్లి ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోట రామకృష్ణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, కోట సత్యనారాయణ రెడ్డి, చొప్పరి రాజయ్య, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, జాగిరి కిషోర్, కందుల సదాశివ,మచ్చ నర్సింగం, తాళ్లపల్లి శ్రీనివాస్, జాగిరి అంజయ్య, కత్తెర రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండలంలోని కనగర్తిలో గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న గ్రామ దేవతల కొలుపు గురువారం చివరి రోజు కాగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ప్రతిష్ఠించిన భూ లక్ష్మీ , మహలక్ష్మీ, బొడ్రాయి వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, చొప్పరి రాజయ్య, ఒడిగె సదయ్య, కందుల సదాశివుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదు'

కమాన్‌పూర్, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఉరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం రాజకీయాలు చేస్తున్నాయన్నారు. రైతుల చిత్తశుద్ధితో స్వర్గీయ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఎనలేని కృషి చేశారని, ఇందుకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణమే నిదర్శనమన్నారు. అలాగే నియోజకవర్గ రైతుల శ్రేయస్సు కోసం మంత్రి శ్రీధర్‌బాబు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చొప్పరి శేఖర్, గ్రామ శాఖ అధ్యక్షులు భూసా తిరుపతి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా కార్యద ర్శి జంగిలి కొమురయ్య, నాయకులు అర్కుటి అంజన్న, తిరుపతి ఉన్నారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 4: రంజాన్ ఉపవాసాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ముస్లింలకు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అల్లా దయ వల్ల ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ప్రేమ్ సాగర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు అల్లం దేవేందర్, ఎండి మునీర్, సబ్బని రాజమల్లు, ఆరెల్లి రమేష్, మాదాసు సతీష్, సొన్నాయిటెంకం శివరామకృష్ణ, ఆషాడపు సురేష్, ఎనగంటి రవి, ద్యాగేటి రామచంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం


ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న హెల్త్ అసిస్టెంట్ కిరణ్

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: రామగుండం కార్పొరేషన్‌లో గురువారం పలు షాపులపై రామగుండం నగరపాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖని రమేష్‌నగర్, తిలక్‌నగర్‌లోని కిరాణాషాపులు, హోటళ్లలో క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ స్పూన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎవరైనా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కూలర్ వితరణ

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 4:రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీర్లపల్లి ఈశ్వర కృప వృద్ధాశ్రమానికి తల్లి శేషమ్మ కోరిక మేరకు సింగరేణి ఆర్‌జీ-3 ఓసీపీ-1 ప్రాజెక్టు ఇంజనీర్ రాజవరపు శ్రీనివాస్ గురువారం అందించారు. ఓసీపీ-1 ఈపీ ఆపరేటర్ పోతుల చంద్రపాల్ చేతుల మీదుగా ఆశ్రమ అధ్యక్షులు పీటీ స్వామి, డైరెక్టర్ లక్కడి మాధవరెడ్డికి కూలర్‌ను అందజేశారు. రాజవరపు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం అందజేత


బియ్యాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రానికి చెందిన సానియా వివాహానికి గురువారం పలువురు దాతలు బియ్యాన్ని అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సానియాకు తండ్రి లేకపోవడంతో పెళ్లి చేసేందుకు తల్లి ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో దాతలు ఇనగంటి రామారావు, కోలేటి శేఖర్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగొని సతీష్, గుండారం గ్రామానికి చెందిన సింగరేణి కార్మికులు ఇరువురాళ్ల ప్రతాప్, రాచకొండ నాగరాజులు బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగొని సతీష్, సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్, బాబా, చిప్పకుర్తి అరవింద్, మహాదేవ, సాయిరాం తదితరులు ఉన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, ఏప్రిల్ 4: మండలం పరిధిలోని బామ్లానాయ క్ తండాలో బధావత్ లక్ష్మి శ్రీనివార్ కుమార్తె గౌతమి వివాహం గురువారం జరిగింది. ఈ పెళ్లికి తండా మాజీ సర్పంచ్ సతీమణి లక్ష్మి హాజరై వధూవరులను ఆశీర్వదించి 10 వేల రూపాయలను అందించారు. తండాలోని ప్రతీ పేదింటి ఆడపిల్ల పెళ్లికి తన భర్త రాజునాయక్ పెద్దన్నల ఉంటూ ఆర్థికసాయం అందిస్తున్నాడని తెలిపారు. ఆర్థిక సహాయం అందించడం పట్ల పలువురు అభినందించారు.

కృష్ణవేణిలో ఓపెన్ హౌస్


ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో చిన్నారులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 4: గోదావరిఖని కృష్ణవేణి విద్యాసం స్థలో ఓపెన్ హౌస్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సరీ, ఎల్‌కేజీ తరగతి పిల్లల తెలివితేటలను వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్రహరీ కూల్చివేత

జ్యోతినగర్, ఏప్రిల్ 4: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సాక్షిగా గురువారం ఎన్టీపీసీ ప్రహరీని వ్యాపారులు కూల్చివేశా రు. సాయి సేవా సమితి సమీపంలోని ఎన్టీపీసీ వార సంత ప్రహరీని కూల్చివేసిన సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మేడిపల్లి సెంటరు, ఆటోనగర్ పరిధిలోని గ్రీన్‌బెల్ట్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను మూడు విడతలుగా రామగుండం నగరపాలక సంస్థ తొలగించింది. గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న రువ్యాపారుల దుకాణాలను తొలగించడంతో వారు ఉపాధి కోల్పో యారు. ఈ క్రమంలో వ్యాపారులకు ప్రత్యామ్నా యంగా ఎన్టీపీసీ వార సంత గోడ పక్కన స్థలాన్ని అధికారులు చూపించారు. అయితే ఆ స్థలంలో షాపులు పెట్టుకోవడానికి కొంత మంది అనాసక్తి చూపించనట్లు తెలుస్తున్నది. కొంత మంది ఎన్టీపీసీ వారసంత ప్రహరీ లోపల తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వార సంత చుట్టూ ఎత్తు పెంచుతూ గోడను ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మించింది. అలాగే సర్వీస్ రోడ్డు వైపు సంతలోకి


ప్రహరీని కూల్చివేస్తున్న వ్యాపారులు

వెళ్లే మార్గాన్ని మూసివేస్తూ గోడను నిర్మించారు. గోడ నిర్మాణానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌కు చిరు వ్యాపారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ప్రహరీ నిర్మా ణాన్ని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరిశీలించారు. ఇదే సమ యంలో చిరు వ్యాపారులు ఎమ్మెల్యే సమక్షం లోనే గతంలో ఉన్న సంతలోకి వెళ్లే మార్గంలో నిర్మించిన గోడను కూల్చివేశారు. వ్యాపారులకు న్యా యం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హామీ ఇనట్లు తెలుస్తున్నది. కాగా ప్రహరీ కూల్చివేత విషయంలో ఎన్టీపీసీ యాజమాన్యం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

పాలకుర్తి, ఏప్రిల్ 4: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పొల్సాని శశికళ ఆదేశించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం లో మాట్లాడారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని సూచించారు. చెడిపోయిన చేతి పంపులను మరమ్మతు లు చేయించాలని, ప్రజలకు త్రాగు నీరు ఇబ్బందులు రాకుండా తీసుకోవల్సిన అన్ని జాగ్రత్తలను వివరించామ న్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పలు చోట్ల చలివేంద్రాలు నెలకొల్పామన్నారు. ఉపాధి హామీ కూలీలకు పనిస్థలాల్లో చల్లని తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. మండలం లో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతున్నామని వివరించా రు. ఉదయం 10 గంటల తర్వాత మధ్యాహ్నం 3 గంటల లోపు ఎండలో తిరగవద్దన్నారు. ఒకవేళ అత్యవసర పనిపై బయటకు వెళ్తే తప్పనిసరిగా గొడుగు ఉపయోగించాలని, వదులు గా ఉండే కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలని తెలిపారు. ప్రతీరోజు కనీసం నాలుగు లీటర్ల నీరు తాగాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందండి

ఎలిగేడు, ఏప్రిల్ 4: ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మండల స్పెషల్ ఆఫీసర్ తిరుపతిరావు సూచించారు. మండల కేంద్రంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (టి-సెర్ప్) మంజునాథ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకో వాలని సూచించారు. తూకంలో ఎలాంటి వ్యత్యాసం రాకుండా రైతులకు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుధాకర్, మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆకుల సౌమ్య, సీసీ ఆనంద్, వీవోఏలు కౌసల్య, రాజేశ్వరి, మమత పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి అని తహసీల్దార్ జాహెద్ పాషా నిర్వాహలకు సూచించారు. గురువారం మం డలంలోని పలు గ్రామాల్లో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రా లను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది తలెత్తవద్దని ప్రభుత్వం గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయని, రైతులు దళారు లను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన


ఎలిగేడు, రామగిరి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి కనీస మద్దతు ధర పొందాలన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త, తాలు, మట్టి పెడలు ,రాళ్లు లేకుండా శుభ్రప రచాలన్నారు. తేమ 17శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బం దులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూ చించారు. కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో కొల్లేటి శ్రీనివాస్, ఎర్రబాటి రవి, సొసైటీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఐకేపీ సెంటర్ వీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం సంగ సదానందం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారు లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని లంబాడ తండా, నాంసానిపల్లిలో గురువారం పొత్కపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిబ్బంది, రైతులు కలిసి ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి కేం ద్రాలకు తీసుకురావాలని, రైతులు కేంద్రాలను విని యోగించుకోవాలని సిబ్బంది అన్నారు. కార్యక్ర మంలో తిరుపతి, సేవినాయక్, రైతులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం, నాగేపల్లి, నవాబుపేట, లద్నాపూర్, రాజాపూర్, గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్ర మానికి డీఆర్డీవో రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎం రవి, ఏపీ ఎం స్వరూపరాణి, సీసీలు శంకర్, రమేశ్, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గోదావరిఖని, ఏప్రిల్ 4: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సింగరేణి సీఎండీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామయ్య, రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్తగా బొగ్గు గనులు రావాలని, కొత్తగూడెం వీకే-7 గని, ఇల్లందు ఏరియాలోని ఎక్స్‌టెన్షన్ గని, తాడిచర్ల-2 గనికి అనుమతులను వేగవంతం చేయాలని, ఒడిస్సా రాష్ట్రంలోని నైని ఓసీపీ పర్మిషన్ వచ్చినా బొగ్గు వెలికి తీయడానికి అడ్డంకులు నెలకొన్నాయని, వాటిని త్వరగా అధిగమించి బొగ్గు ఉత్పత్తి వెలికి తీయాలని సీఎండీని కోరారు. సంస్థలో ఖాళీగా ఉన్న అంతర్గత పోస్టులను పూరించాలని, టెక్నికల్ అర్హత గల ఉద్యోగులను విండో పవర్, హైడల్ పవర్, థర్మల్ పవర్, సోలార్ పవర్‌లో అవకాశం కల్పించాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, 2024-24 ఆర్థిక సంవత్సరానికి గాను 72మిలియన్ టన్నుల బొగ్గుఉత్పత్తి సాధించడానికి ఏఐటీయూసీ తన పూర్తి సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పం దించిన సీఎండీ బలరాం, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు మిర్యాల రంగయ్య, సారయ్య, వైవీరావు, వీరభద్రయ్య, మడ్డి ఎల్లయ్య, సమ్మయ్య, నర్సింగారావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల రక్షణ, ఆరోగ్య ప్రాధాన్యం స్టార్ రేటింగ్‌పై శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 4: బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఉద్యోగుల రక్షణ, ఆరోగ్య ప్రాధాన్యాన్ని గమనిస్తూ స్టార్ రేటింగ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. కోల్ ఇండియా, సింగరేణి యాజమా న్యంలో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి ఏరియాలోని ప్రతి గని, డిపార్ట్‌మెం ట్‌ను పరిశీలించి స్టార్ రేటింగ్ ఇచ్చే క్రమంలో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల నిర్ణయానుసారం సింటర్స్‌లో గురువయ్య అధ్యక్షతన ఒకరోజు శిక్షణ కార్యక్ర మం జరిగింది. కార్యక్రమంలో ఏరియా జనర ల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారా యణ, జీఎం(సేఫ్టీ) గుప్తా, ఆర్‌జీ-1 జీఎం చింత ల శ్రీనివాస్, ఏరియా రక్షణా ధికారి బచ్చ రవీందర్, ఏరియా నరసింహారావు, డీజీఎం(పర్సనల్) అధికార ప్రతినిధి జీ రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముర్మూర్ పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్

అంతర్గాం, ఆగస్టు 4: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ వద్ద గల హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ పంప్‌హౌస్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా 160ఎంఎల్‌డీని పరిశీలించి హైదరాబాద్, ఆర్‌ఎఫ్‌సీఎల్, స్థానిక మిషన్ భగీరథ తాగునీటి శుద్ధి, సరఫరా తీరను పరిశీలించారు. వేసవిలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన నేపథ్యంలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముర్మూర్ పంప్‌హౌస్, ఎల్లంపల్లి అధికారులను ఆదేశించారు. త్వరలో నీటి సరఫరాకు సంబంధించిన సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు, అధికారులు సమగ్ర వివరాలతో హాజరు కావాలని సూచించారు. ఈ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కార్యక్రమంలో ముర్మూర్ పంప్‌హౌస్ ఇంజనీర్ సతీష్‌యాదవ్, తహసిల్దార్ రాంమోహన్‌రావు, ఎల్లంపల్లి ప్రాజెక్టు డీఈ కీర్తి, మిషన్ భగీరథ ఏఈ అస్లాం, హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీజీఎం రామ కృష్ణ, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు షా, అమోల్ సొనారే తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ సేవా సమితి ఆర్థికసాయం

ధర్మపురి, ఏప్రిల్ 4: మండలంలోని జైనాలో ఇటీవల మృతి చెందిన కుంటాల చంద్రమౌళి కుటుంబ సభ్యులకు గురువారం జైనా- కొసునూర్‌పల్లె గల్ఫ్ సేవా సమితి తరఫున రూ.30,000 ఆర్థికసాయం అందిం చారు. జైనా గ్రామానికి చెందిన కుంటాల చంద్రమౌళి గల్ఫ్ దేశంలో క్యాన్సర్ బారినప డి స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఇంటి వద్దనే మృతి చెందాడు. గల్ఫ్ సేవా సమితి సభ్యులైన చంద్రమౌళి కుటుంబ సభ్యులకు ఆ సంఘం పక్షాన ఆర్థికసాయం అందించా రు. కార్యక్ర మంలో జైనా-కొసునూర్‌పల్లె గల్ఫ్ సేవా సమితి సభ్యులు సుంకు మదుసూధన్, కోస్న మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, షైదం మదు, ముడిమడుగు రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4: పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పెద్దపల్లి శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి బి గంగయ్య పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో గంగయ్య మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత వీవీప్యాట్‌లో స్లిప్పులను తొలగించాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కంట్రోల్ యూనిట్లో తప్పనిసరిగా క్లోజ్ బటన్ నొక్కాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలించి, ఓటరు జాబితాలో ఉన్న అతని వివరాలు చూసుకుని, రిజిస్టర్‌లో పేరు నమోదు చేయాలన్నారు. శిక్షణాకార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్, రెవెన్యూ అధికారులు, పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

● **రామగిరి:** ఎన్నికల పోలింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని



సమావేశంలో మాట్లాడుతున్న హనుమానాయక్

పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం మంథని శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి హనుమానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోగల పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహిం చిన శిక్షణా కార్యక్రమానికి హనుమానాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్‌ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తతో వ్యవహరించాల్సిందిగా సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. కా ర్యక్రమంలో తహసీల్దార్లు రాంచందర్‌రావు, ఆరీఫోద్దీన్, నాగరాజు, రాజ య్య, మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.